చేయీ చేయీ కలిపి..
చెత్త తొలగించి..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా కాలనీలు, బస్తీల్లో జీహెచ్ఎంసి, సంక్షేమ సంఘాల, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పరిశుభ్రతా పనులు చేపట్టారు. కాలనీలోని పార్కులు, ఖాళీస్థలాలు, ప్రధాన రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. జోనల్ కమిషనర్ మమత చెరువుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనిలో చేయి కలిపారు.

– కుత్బుల్లాపూర్


చెరువులో వ్యర్థాలను తొలగిస్తున్న జోనల్ కమిషనర్ మమత..


నిజాంపేట్‌లో నర్సరీలో కలుపు తీస్తున్న మేయర్ నీలారెడ్డి..


ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో..


జగద్గిరిగుట్ట సంజయ్‌పురి కాలనీలో..


దుండిగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..


సూరారం రామ్‌లీలా మైదానంలో కమిటీ ఆధ్వర్యంలో..


గాజులరామారం బాలయ్యనగర్ బస్తీలో..



కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నాగమణి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తూ..


కొంపల్లిలో రోడ్లపై చెత్తను ఊడుస్తున్న కమిషనర్ శ్రీహరి..

క్లుప్తంగా

కాలనీ అభివృద్ధికి కృషి


సురేష్‌రెడ్డిని సత్కరిస్తున్న భగత్‌సింగ్‌కాలనీ అధ్యక్షుడు జహంగీర్

సుభాష్‌నగర్: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం భగత్‌సింగ్‌నగర్ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో సూరారం కాలనీలోని కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రూ.48.80 లక్షల నిధులతో సీసీ రోడ్లు పనులు పూర్తి చేయించిన సురేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ కమిటీ అధ్యక్షుడు జహంగీర్ శాలువతో సన్మానించారు. సంక్షేమ సంఘం నాయకులు అంజాద్ సైదులు, గడ్డం కిష్టయ్య, గోపాల్ దాస్ సైదులు, కరీం భాయ్, యాకస్వామి, బహదూర్ భాయ్, వెంకన్న, తిరుపతి తదితరులు ఉన్నారు.

అన్ని హంగులతో సర్కారు స్కూల్


పాఠశాల పనులు పూర్తి అయిన తర్వాత

జగద్గిరిగుట్ట: గాజులరామారం డివిజన్ లెనిన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అత్యాధునిక హంగులతో మంగళవారం ప్రారంభం కానుంది. గత ఏడాది వరకు ఈ పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులు ఒకే గదిలో పాఠాలు నేర్చుకొనేవారు. కాగా 8 నెలల క్రితం పాఠశాలను అభివృద్ధి చేయడానికి కార్నివలి ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడంతో ఈ పాఠశాల పూర్తిగా మారిపోయింది. సుమారు 56 లక్షలతో 3 తరగతి గదులు, లైబ్రరీ, వంటశాల, టాయిలెట్లు, ఆర్ఓ ప్లాంట్‌ల నిర్మాణం చేపట్టారు. అన్ని వసతులతో ఉన్న ఈ పాఠశాలలో తల్లి దండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఇటీవల పాఠశాల సిబ్బంది ర్యాలీ కూడా నిర్వహించారు. కాగా అన్ని సౌకర్యాలతో మంగళవారం తిరిగి ప్రారంభం కానుంది.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట బస్టాండ్ సమీపంలోని ఇందిరా గాంధీ విగ్రహం చౌరస్తాలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. నిత్యం బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు తిరిగే ఈ చౌరస్తాలో గతంలో కూడా మ్యాన్ హోల్ మరమ్మత్తులు చేసారు. తిరిగి మళ్లీ పునరావృతం కావడం, ఈ చౌరస్తాలో భయపడుతూ వెళ్లాల్సి వస్తుంది. ఎటువంటి ప్రమాదం జరగక ముందే సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ఇది పార్కా.. ఓపెన్ బారా..?



సుభాష్‌నగర్: కాలనీలో ఆహ్లాదాన్ని ఇచ్చే పార్కులను కొంతమంది మందుబాబులు ఓపెన్ బార్ లాగా మారుస్తున్నారు. జీడిమెట్ల డివిజన్ గోదారి హోమ్స్ నుండి జీడిమెట్ల విలేజ్ వెళ్లే దారిలో ఉన్న పార్కును మందుబాబులు పోకిరిలు అడ్డగా మార్చుకున్నారు. చీకటి పడిందంటే చాలు మద్యం తాగుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో అటుగా వెళ్లాలంటే స్థానికులు జెంకుతున్నారు. సంబంధిత అధికారులు నిఘా పెట్టి మందు బాబులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: సరైన ఉపాధి లేకపోవడంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన మేరకు.. కుత్బుల్లాపూర్ బోశంకర్ నగర్‌కు చెందిన వనం సతీష్ (35) తల్లితో కలిసి ఉంటున్నాడు. తల్లి అనారోగ్యంతో ఉండటంతో వినాయకనగర్‌లోని సతీష్ సోదరుడు లింగం ఇంటికి వెళ్లింది. దీంతో ఇంట్లో ఒంటరిగా ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సతీష్ ఇంట్లో నుండి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన చుట్టుపక్కల వారు ఆదివారం ఉదయం సోదరుడికి సమాచారం అందించాడు. లింగం వచ్చి చూసే సరికి సతీష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతిచెంది ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వరదనీటి సమస్యను పరిష్కరించండి


మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల అసోసియేషన్ సభ్యులు

నిజాంపేట్: వర్షపునీరు సాఫీగా వెళ్లే విధంగా వరద నీటి కాలువలను నిర్మించడం జరిగిందని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ కాలనీ, ఆర్‌కే లేఅవుట్, చందు లేఅవుట్ సంక్షేమ సంఘం సభ్యులు మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతంలో వర్షాలు పడ్డ ప్రతిసారి వరదనీరు వచ్చి చేరుతోందని, దీంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమల బెడద ఎక్కువైందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. స్పందిస్తూ ఇప్పటికే పలు ప్రాంతాల్లో నాలా నిర్మాణాలు చేపట్టడం జరిగిందని, వరదనీరు సాఫీగా వెళ్లేగా స్ట్రామ్ డ్రెయిన్‌లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

నిమజ్జన వేడుకల్లో మంత్రి మహేందర్ రెడ్డి


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శంభీపూర్‌లో ఆదివారం రాత్రి వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు హాజరయ్యారు.

– కుత్బుల్లాపూర్

క్రీడాభివృద్ధికి ప్రాధాన్యం

కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తూ క్రీడాకారుల ప్రోత్సహిస్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి భౌరంపేట్‌లోని శ్రీరామ్ స్కేటింగ్ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం నిర్వహించిన 15వ ఇంటర్ స్కూల్ స్కేటింగ్ కాంపిటీషన్ పోటీలను ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ ఇ రాజు ఇండియన్ ఫాసెస్ట్ స్కేటర్, ఏషియన్ మెడలిస్ట్ నిఖిలేష్ తబానేతో కలిసి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రభుత్వ పరంగా అనేక ప్రోత్సహకాలు, ఉద్యోగవకాశాలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన పలువురు క్రీడాకారులకు ఆయన ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు.

◆ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేయగా ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారు.



యువతి ఆత్మహత్య


నాగదుర్గ (ఫైల్)

జీడిమెట్ల: ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన మేరకు.. సుభాష్‌నగర్ లాస్ట్ బస్టాప్‌లో నివసించే కరీంశెట్టి జన్నీ, సత్యవతి దంపతులకు ఒక కుమార్తె యువనాగదుర్గ(23), ఓ కుమారుడు ఉన్నారు. కుమార్తె యువనాగదుర్గకు వివాహం చేసేందుకు ఫిబ్రవరి నెలలో ఓ యువకుడితో ఎంగేజ్‌మెంట్ నిర్వహించారు. ఇటీవల తల్లిదండ్రులు మంచి ముహూర్తం చూసి పెళ్లి చేయాలని నిశ్చయించారు. కాగా శనివారం యువతి తల్లిదండ్రులు బయటకు వెళ్లగా ఇంట్లో యువనాగదుర్గ, ఆమె సోదరుడు ఉన్నారు. సాయంత్రం సోదరుడిని తినేందుకు ఆహారం తీసుకురావాలని కోరగా అతడు బయటకు వెళ్లాడు. ఆహారం తీసుకుని రాత్రి ఇంటికి వచ్చే సరికి యువనాగదుర్గ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ మృతి చెంది ఉంది. యువతి కుటుంబసభ్యుల పిర్యాదు మేరకు పోలీసులు పంచనామా నిర్వహించారు. మతురాలి తండ్రి జన్నీ పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాబుకు మంత్రులు వత్తాసు పలకడం దారుణం

కుత్బుల్లాపూర్: అవినీతి ఆరోపణలపై అరెస్ట్ అయిన చంద్రబాబు నాయుడికి తెలంగాణ మంత్రులు వత్తాసు పలకడం దారుణమని వైఎస్సార్‌టీపీ కుత్బుల్లాపూర్ నియోజవర్గ కో.ఆర్డినేటర్ సురేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో సీఐడీ పోలీసులు చంద్రబాబును అరెస్ట్ చేస్తే తెలంగాణ మంత్రులు ఇది కరెక్ట్ కాదని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. నేరం చేసిన వారికి శిక్ష తప్పదని, ఏ వయస్సు వారైనా శిక్షార్హులేనన్న విషయాన్ని వారు మరిచారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కంచాల మోత కార్యక్రమ అట్టర్ ప్లాప్ అయ్యిందని, వచ్చే ఎన్నికల్లో ఏపీ లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తప్పదని,160పైచీలుకు స్థానాలు కైవసం చేసుకుంటుదని సురేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

'డబుల్' ఇళ్లకు నేడు లాటరీ

దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల తుది జాబితా లబ్ధిదారులకు సోమవారం రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ లాటరీ పద్ధతిలో అందించనున్నారు. దుండిగల్‌లో జరిగే ఈ కార్యక్రమంలో నిజాంపేట్, బాచుపల్లి, కైసర్‌నగర్‌లోని 3142 ఫ్లాట్లను ప్రారంభించి అనంతరం కూకట్‌పల్లి, సనత్‌నగర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందించనున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న గుజరాత్ హ్యాండీక్రాఫ్ట్స్ ఉత్సవ్‌కు ఆదివారం నగరవాసులు పోటెత్తారు. చెక్కతో తయారు చేసిన గృహాలంకరణ వస్తువులు, డ్రెస్ మెటీరియల్స్, తంగలీయా చీరలు, చున్నీలు ప్రత్యేక అకర్షణగా నిలుస్తున్నాయి. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆంపి థియేటర్‌లో గుజరాత్‌కు చెందిన జానపద నృతాలు కాచిగోడి, పప్పెట్‌షో, రాస్ గర్బ నృత్యాలు సందర్శకులను అలరించాయి.

అభివృద్ధిని విస్మరించిన గత ప్రభుత్వాలు


అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే వివేకానంద్..

కుత్బుల్లాపూర్: గత ప్రభుత్వాలు కాలనీలు, బస్తీల అబివృద్ధిని విస్మరించాయని, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి నోచుకుంటున్నాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఆదివారం సుభాష్‌నగర్ డివిజన్‌లో ప్రగతియాత్ర చేపట్టిన ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. భాగ్యలక్ష్మి కాలనీలో రూ.51.6 లక్షలతో సీసీ రోడ్డు. లిటిల్ స్టార్ స్కూల్ రోడ్డులో రూ.28 లక్షలతో, భగత్‌సింగ్‌నగర్‌లో రూ.48.8 లక్షలు, అల్లూరి సీతారామరాజునగర్‌లో రూ.31 లక్షలు, రాజీవ్‌గృహకల్పలో రూ.71.2 లక్షలు, శివసాయినగర్‌లో రూ.45.5 లక్షలు, జైబీమ్‌నగర్‌లో రూ.15 లక్షలతో, జీవన్‌జ్యోతినగర్‌లో రూ.54.5 లక్షలు, సూరారం కాలనీలో రూ. 34 లక్షలు, భవానీనగర్‌లో రూ.35 లక్షలు, రామిరెడ్డినగర్‌లో రూ.87 లక్షలు, ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో రూ.31 లక్షలు, సుందర్‌నగర్‌లో రూ.18,5 లక్షలు, జైసంతోష్‌నగర్‌లో రూ.34 లక్షలతో చేపట్టనున్న భూగర్బ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ ప్రతి కాలనీ, బస్తీలో మౌలిక సదుపాయాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కాలనీలు, బస్తీల సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా సీనియర్ సిటిజన్స్ దినోత్సవం


కె.ఎం.ప్రతాప్‌ను సత్కరించిన సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ సభ్యులు..

కుత్బుల్లాపూర్: చిన్నతనం నుండే పిల్లలకు పెద్దల పట్ల మర్యాద నేర్పిస్తే వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటారని బీఆర్ఎస్ నాయకుడు కె.ఎం.ప్రతాప్ అన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని ఆదివారం జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీనియర్ సిటిజెన్స్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రతాప్ కేక్ కట్ చేసి సీనియర్ సిటీజన్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పెద్ది మల్లేశం, కోశాధికారి రత్న మురళిగౌడ్, సంయుక్త కార్యదర్శి బండి బిక్షపతిగౌడ్, ఉపాధ్యక్షులు గొప్పగోని నరహరిగౌడ్, రామన్, నల్లా లింగంగౌడ్, నార్లకంటి నాగేష్‌కురుమ, పాండు తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ కార్యక్రమం వాయిదా

కూకట్‌పల్లి: అనివార్య కారణాల వల్ల మంత్రి కేటీఆర్ ముఖ్య అతిధిగా విచ్చేస్తున్న సందర్భంగా జరిగే కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రగతి నివేదన సభ అక్టోబర్ 3 నుంచి 5వ తేది 4 గంటలకి మార్చినట్లు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బీఆర్‌యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, ప్రజలు అందరూ ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

7,8,9 తేదీల్లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

మాదాపూర్: మాదాపూర్‌లోని నోవాటెల్‌లో హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్‌ను అక్టోబర్ 7,8,9వ తేదీలలో మూడురోజుల పాటు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో నటులు చాందిని బగ్వానాని,మిస్ ఇండియా తెలంగాణ ఊర్మిళా చౌహాన్, పలువురు మోడల్స్ మాట్లాడుతూ బ్రైడల్‌వేర్, వెడ్డింగ్‌వేర్, జ్యూలరీ, ప్రత్యేక డిజైన్‌లతో కూడిన చీరలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మోడల్స్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ టెర్రర్



కూకట్‌పల్లి జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రాంతంలో గత రెండు రోజులుగా ట్రాఫిక్ స్తంభించి కూకట్‌పల్లి రహదారులన్నీ మూసుకుపోయాయి. ఒకవైపు హైటెక్‌సిటీ నుంచి జేఎన్‌టీయు వైపు వచ్చే వాహనాలు సుమారు ఐదు కిలోమీటర్ల మేర వరకు స్తంభించి పోయాయి. ఇటీవల ప్రారంభమైన ఓ షాపింగ్ మాల్‌కు ప్రజలు పెద్ద ఎత్తున పోటెత్తడంతో పాటు వాహనాలను రోడ్లపైనే పార్కింగ్ చేశారు. దీంతో అక్కడ ట్రాఫిక్ వ్యవస్థ కంట్రోల్ లేకుండా పోయింది. మరోవైపు జేఎన్‌టీయూ నుంచి భరత్‌నగర్ వరకు ట్రాఫిక్ స్తంభించి రెండు కిలోమీటర్లకు రెండు గంటల ప్రయాణం సమయం తీసుకుంది. దీంతో వాహనదారులు రోడ్లపై చిర్రెత్తిపోతున్నారు. ఇదిలా వుండగా ఆదివారం సెలవు రోజు కావటంతో చాలా మంది రోడ్లపైకి వచ్చారు. కూకట్‌పల్లి ప్రాంతంలో పార్కింగ్ కోసం ప్రత్యేకమైన స్థలాలు లేకపోవడంతో వాహనదారులు రోడ్లపైనే పార్కింగ్ చేయటం మూలంగా రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇది ఇలా ఉండగా అంతర్గత రహదారుల్లో కూడా వాహనాలు నిండిపోయి ఉండడంతో ప్రతి చౌరస్తాలో కూడా ట్రాఫిక్ స్తంభించి పోయింది. కూకట్‌పల్లిలోని కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, వివేకానందనగర్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, హెచ్ఎంటి శాతవాహన నగర్ కాలనీ, వసంత నగర్, ప్రగతి నగర్ రోడ్డు, నిజాంపేట చౌరస్తా తదితర ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం 3 నుంచి 7 గంటల వరకు రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల దూరం నిలిచిపోయాయి. కూకట్‌పల్లిలో ఇప్పటికే ఐదు ఫ్లై ఓవర్లు వేసినప్పటికీ మెట్రో రైలు నడుస్తున్నప్పటికీ ట్రాఫిక్ అంతరాయంలో ఏ మాత్రం మార్పు రాలేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.